



## జరిగిన జగన్నాటకం

సవ్యలంకలో కుడి చేతిని వాడినందుకు విధించిన మరణదండన నుంచి తప్పించుకున్నాడు బోసు. బోసే మహాబసు అని అతణ్ణి నాయకుణ్ణి చేశారు. పోరాటం మొదలైంది. వామదేవుడి గూఢచారి ఉదంతుడు పోరాటంలో చేరాడు. మహాబసుగా తన అనుభవాలన్నింటినీ డా. నరసింహంకి చెప్పాడు సారథి. పేరలల్ వరల్డ్స్ లో ప్రయాణం వల్ల సారథి సవ్యలంకకి వెళ్ళాడని డా. నరసింహం చెప్పాడు. వర్తకులతో, సిరిగిరితో చర్చలకు వెళ్ళాడు మహాబసు. అనుమానంతో బయట వేచివున్న ఉగ్ర, సుధాముల మీద దళాధిపతి దాడి చేశాడు. సిరిగిరి, ఇతర వ్యాపారస్థులు పిలిచిన సమావేశానికి వెళ్ళిన మహాబసుని చంపాలని దళాధిపతి తన సైన్యంతో దాడి చేసి, బయట వున్న సుధాముణ్ణి చంపేశాడు. సమావేశ మందిరంలో మహాబసు లేడని అరిచింది ద్వీప.

నరసింహం ఆసక్తిగా వింటున్నాడు. సారథి ఎప్పటిలాగే తన ధోరణిలో చెప్పుకుంటూపోతున్నాడు.

“చాలా చిత్రమైన సమావేశం అది. ఎట్ లీస్ట్ నాకు కొత్త అనుభవం. బిజినెస్ చేసే వ్యక్తులు పాలకులను ప్రభావితం చేస్తారని నేను తెలుసుకున్నాను. ఐ మీన్ మనకి కూడా తెలిసిందే కానీ అది ప్రత్యక్షంగా తెలుసుకోవడం చాలా కొత్తగా అనిపించింది.” చెప్పాడు. డాక్టర్ నరసింహం తలాడించాడు, తరువాత జరిగింది చెప్పమన్నట్లు.

“నేను చెప్తున్నదంతా కథగానో నవలగానో రాస్తున్నారా డాక్టర్?” సారథి ప్రశ్నకి తడబడ్డాడు నరసింహం.

“లేదు... లేదు... అలా ఎందుకు అనిపించింది?” అనడిగాడు.

“ఏం లేదు. నేను చెప్పే విషయాలు వినడానికి మీరు చూపించే ఆసక్తి చూస్తుంటే అనుమానం వచ్చింది.” అంటూ మళ్ళీ కొనసాగించాడు సారథి. “బయట అలికిడి అయ్యింది. మొదట నాకు తెలిసింది కానీ నేను ఆ విషయం గురించి మాట్లాడలేదు. సిరిగిరిగారు ఆయన చెప్పాల్సిన విషయాన్ని దాదాపు పూర్తి చేసిన తరువాత బయట నుంచి వినపడుతున్న అరుపులను గుర్తించాడు.

“బయట ఏదో జరుగుతోంది మహాబసు” అన్నాడు. నేను ఆ మందిరానికి వున్న కిటికిలో నుంచి చూశాను. బయట పోరాటం జరుగుతోంది.

వందల సంఖ్యలో సైన్యం. అటువైపు సైన్యానికి నాయకుడు దళాధిపతి. ఇటు వైపు ఉగ్ర, సుధాముడు. ఈ ఇద్దరే. ఇద్దరు కలిసి వందల సైన్యాన్ని ఎదిరిస్తున్నారు. అది కూడా నా ఒక్కడి కోసం. వాళ్ళ ప్రాణాలకు ముప్పు ఎలాగూ వుంది. నేను ప్రాణాలతో బయటపడే అవకాశం కూడా లేదనే అనిపించింది. అన్నివైపులా పరికించి చూశాను. బయటికి వెళ్ళడానికి ముఖద్వారం తప్ప మరో మార్గం లేదు. ఆ ద్వారం దగ్గర మొత్తం సైన్యం మోహరించి ఉన్నారు. ఏ క్షణాన సుధాముణ్ణి, ఉగ్రని హతమారుస్తారో మరుక్షణం వందల మంది సైన్యం సమావేశమందిరంలోకి వస్తారు. అంతమందితో పోరాడి నిలబడగలన్న నమ్మకం నాలో లేదు” చెప్తూ ఆగాడు సారథి.

డాక్టర్ నరసింహం ముఖంలో ఆసక్తి క్రమంగా ఆందోళనగా మారటం స్పష్టంగా తెలుస్తోంది సారథికి.

“ఎందుకు అంత టెన్షన్ పడుతున్నారు? నేను చచ్చిపోలేదు. ఒకవేళ ఆ ప్రపంచంలో నేను చచ్చిపోతే ఈ ప్రపంచంలో కూడా లేకుండాపోతానని మీరు ఒకసారి చెప్పారు గుర్తుందా?”

తలాడించాడు నరసింహం.

“ఇప్పుడు మీ ముందు నిలబడి వున్నాను అంటే అక్కడ చావలేదనే కదా?” నవ్వేశాడు సారథి. డాక్టర్ నరసింహం గట్టిగా నిట్టూర్చి ఆ తరువాత నవ్వాడు.

“అయితే ఎలా తప్పించుకున్నారు? ఉగ్ర, సుధామ సైనికుల్ని హతమార్చారా? మీరు కూడా బయటకు వెళ్ళి వాళ్ళతో పోరాడి గెలిచారా? తప్పించుకోవడం ఎలా సాధ్యమయ్యింది?” మళ్ళీ ఆతృత ధ్వనించే గొంతుతో అడిగాడు నరసింహం. సారథి గట్టిగా నవ్వాడు.

“ఏమైంది? ఎందుకలా నవ్వుతున్నారు?”

“మీరు మాట్లాడే భాషని చూసి”

“ఏమైంది నా భాషకి?”

“హతమార్చారా? పోరాడి గెలిచారా? అంటూ మాట్లాడుతున్నారు. ఇంగ్లీష్ పదాలు మర్చిపోయారు. నాతో మాట్లాడి మాట్లాడి మీరు కూడా అదే భాషని వంటపట్టించుకున్నట్లున్నారు. కొంపదీసి మీరు కూడా నా లాగే ఆ ఊహాలోకంలో బతుకుతున్నారా?” అడిగాడు సారథి.

"అది ఊహాలోకం కాదు మహాబసూ. నిజం. నిజమైన ప్రపంచం. మన ప్రపంచం ఎంత నిజమో, ఆ ప్రపంచం కూడా అంతే నిజం. నేను మీకు చెప్పాను కదా? ఈ ప్రపంచానికి సమాంతరంగా వుండే మరో ప్రపంచంలోకి మీరు ఏదో కారణం వల్ల వెళ్ళగలిగారు. అంతే! అది గుర్తుపెట్టుకోండి" కాస్త కటువుగా చెప్పాడు నరసింహం. అతని రియాక్షన్ చూసి ఆశ్చర్యపోయాడు సారథి.

కాస్సేపు ఇద్దరూ మాట్లాడుకోలేదు. తరువాత డాక్టర్ నరసింహమే మాట్లాడాడు –

"సారీ, ఏదో ఆవేశంలో మాట్లాడాను. తరువాత ఏం జరిగిందో చెప్పండి" అన్నాడు

"నేనేం చెయ్యాలో నిర్ణయించుకోడానికి మరో ఇబ్బంది సిరిగిరి గారు. ఆయన్ను వదిలి బయటికి వెళ్ళలేను. ఒకవేళ సైనికులే లోపలికి వస్తే నన్ను నేను కాపాడుకోవడం కన్నా ఆయన్ను కాపాడుకోవటం కష్టమేమో అనిపించింది. ఆ విషయం ఆయనకు కూడా అర్థమైనట్లుంది. వెంటనే నాతో చెప్పాడు –

"మహాబసూ! నేను ప్రభుత్వానికి అనుకూలంగా పని చేసే వ్యాపారవేత్తని. ప్రభుత్వం నడవడానికి అవసరమయ్యే డబ్బుని పన్నుల రూపంలో కట్టేవాడిని. నన్ను చంపాల్సిన అవసరం కానీ, నన్ను చంపితే వచ్చే ఉపయోగం కానీ ఏదీ లేదు. కాబట్టి నా గురించి ఆలోచించడం మానేసి నిశ్చింతగా వుండండి. మీరు మాత్రం ఎలాగైనా తప్పించుకోవాలి." అన్నాడు.

ఆయన చెప్పిన మాట నిజమే. కానీ ఆవేశంతో లోపలికి దూసుకొచ్చే సైనికులు ఎదురుగా వున్న మనుషులని చంపాలనుకుంటారు కానీ, వాళ్ళు ఎవరు? వాళ్ళని చంపాలా లేదా? అన్న విచక్షణని వాడుతారని నేను అనుకోలేదు. అందువల్ల చాలా అప్రమత్తంగా వున్నాను."

లోపల నాతో వున్న సిరిగిరిని కాపాడుకోవాలా? బయటకు వెళ్ళి అనుచరుల్ని కాపాడుకోవాలా? అన్న అనుమానంతో చాలాసేపు లోపలే వుండిపోయాను.

"సరిగ్గా అప్పుడే ఒక అనుకోని సంఘటన జరిగింది. సమావేశ మందిరం దక్షిణం వైపు వున్న గోడకి దగ్గరగా భూమి కంపించినట్లుగా అనిపించింది. జాగ్రత్తగా పరిశీలించి చూస్తే అక్కడ ఏదో నేలమాళిగ కానీ సొరంగ మార్గం కానీ వుందని అర్థం అయ్యింది. అందులో ప్రవేశించడానికి వున్న మార్గానికి అడ్డుగా వున్న తలుపుని తెరవడానికి ఎవరో ప్రయత్నిస్తున్నారు. ఆ విషయం అర్థమవగానే నేను పరుగున వెళ్ళి ఆ తలుపుని బయటకి లాగటం మొదలుపెట్టాను. మూడుసార్లు ప్రయత్నించిన తరువాత ఆ తలుపు తెరుచుకుంది. అందులో నుంచి బయటికి వచ్చిన వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాను. అతను ఉదంతుడు"

<★><★><★>

మహాబసు మాయమవడం ఎలా సాధ్యమైందో ఉగ్రకి అర్థం కాలేదు. ద్వీప అరుపు విని లోపలికి పరుగెత్తిన ఉగ్ర ఆశ్చర్యంగా సమావేశ మందిరం మొత్తాన్ని పరికించి చూశాడు. ఖచ్చితంగా ఆ మందిరానికి మరో ద్వారం లేదన్న సంగతి అతనికి తెలుసు. ఆ ద్వారం బయటే తాను సుధాముడితో కలిసి కాపుకాశాడు. మరి ఇదెలా సాధ్యమైంది? ప్రశ్నలు అతని బుర్రలో తిరుగుతుండగా అక్కడే వున్న మరో వ్యక్తి ముందుకు వచ్చాడు – సిరిగిరి.

"నా పేరు సిరిగిరి." చెప్పాడు ఎవరూ అడగకుండానే. బహుశా తనని తాను పరిచయం చేసుకుంటే, అతని వ్యాపార సామ్రాజ్యం గురించి తెలిసిన వాళ్ళు ఒక్కరైనా వుంటారేమో అన్నట్లుగా వుందా ప్రకటన.

"మహాబసు ఎక్కడ?" కత్తిని దూసి అతని ముందుకి దూకుతూ అడిగాడు ఉగ్ర.

సిరిగిరి మాట్లాడలేదు. చేతిని పైకెత్తి దక్షిణం గోడ దగ్గర వున్న సొరంగ మార్గం వైపు చూపించాడు.

"ఎక్కడికి పంపించావ్?" ఉగ్ర కోపం ఇంకా తగ్గలేదు.

"పంపించింది నేనే అయ్యుంటే ఇక్కడే నిలబడి మీకు దొరికేవాణ్ణి కాదు" అన్నాడు.

"ఎవరు తీసుకెళ్ళారు?" మళ్ళీ అడిగాడు

"ఉదంతుడు" పిడుగులా వినపడిందా పేరు. ఉగ్ర అప్పుడే లోపలికొచ్చిన ద్వీప వైపు ఆశ్చర్యంగా చూశాడు. తిరిగి సిరిగిరి వైపు చూశాడు

"మీరెందుకు వెళ్ళలేదు?" ఉగ్ర సంబోధనలో మీరు వినపడటం గమనించి నవ్వుకున్నాడు సిరిగిరి

"అటు వామదేవుడితో కానీ ఇటు మీ వర్గంతో కానీ నాకు ఎలాంటి వైరం లేదు. నన్ను చంపాల్సిన అవసరం ఎవరికీలేదు. ఒకవేళ ఈ వయసులో చనిపోయినా వచ్చే నష్టమూ లేదు. అందుకే వుండిపోయాను." సంజాయిషీ ఇస్తున్నట్లుగా కాక వాస్తవాన్ని వాస్తవంగా చెప్పినట్లుగా అన్నాడాయన.

కొంతసేపు ఎవరూ మాట్లాడుకోలేదు.

"కూర్చోని మాట్లాడుకుందామా?" అడిగాడు సిరిగిరి చివరికి. అంతా ఒక చోట కూర్చున్నారు. సిరిగిరి చెప్పడం ప్రారంభించాడు.

"చర్చలు మేము అనుకున్నట్లుగా జరగలేదు. మీరు చేస్తున్న పోరాటాన్ని ఆపాలని మా వ్యాపారస్థుల ప్రతిపాదన. అందుకు మహాబసు అంగీకరించలేదు. నాతో విడిగా మాట్లాడాలని ప్రత్యేకంగా సమావేశమయ్యాము. అక్కడ" అంటూ అంతకుముందు ఆయన, మహాబసు కూర్చున్న చోటుని చూపించాడు. అందరి ముఖంలో వున్న ఆసక్తిని గమనించి చెప్తున్న విషయాన్ని కొనసాగించాడు.

"వ్యాపారం, పోరాటం గురించి కన్నా వ్యాపారం, ప్రభుత్వం గురించే ఎక్కువ మాట్లాడుకున్నాము. ఇంతలో బయట జరుగుతున్న కోలాహలం వినపడింది. ముందు మహాబసే తెలుసుకున్నాడు. ఆయనకి బహుశా పోరాడాలని వున్నా, నా ప్రాణాలను కాపాడాలనేమో లోపలే వుండిపోయాడు. నేను అప్పటికీ చెప్పాను. నేను చనిపోయినా, మహాబసు బ్రతకడం ముఖ్యమని. అయినా ఆయన ఖాతరు చెయ్యలేదు. బయట భీకరమైన పోరాటం జరుగుతోంది. నన్ను కాపాడటమా లేక బయట వున్న తన అనుచరులను కాపాడటమా అన్న శంకతో చాలాసేపు తటపటాయించాడు. చివరికి అనుకోకుండా ఆ సొరంగ మార్గం నుంచి ఉదంతుడు వచ్చాడు. మహాబసుని కాపాడటానికే వచ్చాననీ చెప్పాడు. తనతో వెంటనే రమ్మనమని అడిగాడు. మహాబసు అందుకు అంగీకరించి అతనితో కలిసి వెళ్ళిపోయాడు" చెప్పి కాస్త ఆగాడు సిరిగిరి.

"ఎక్కడికి వెళ్ళాడు? ఈ సొరంగం ఎక్కడికి వెళ్తుందో తెలుసా?" ఉగ్ర అడిగాడు

"ఇంతకాలం కనపడకుండా పోయిన ఉదంతుడు ఇప్పుడు ఎక్కడ్నుంచి వచ్చాడు?" ద్వీప ఆశ్చర్యంగా అడిగింది.

"ఉదంతుడు కనిపించకుండాపోయాడా?" ఈసారి ఆశ్చర్యపోవడం సిరిగిరి వంతైయింది.

"అవును. ఉద్యమద్రోహి పశుపాల కారణంగా ఉదంతుడు చనిపోయాడనీ కొంతమంది చెప్పుకుంటున్నారు. చెరసాల పాలయ్యాడని ఇంకొందరు అంటున్నారు. పశుపాల ఉదంతుణ్ణి చంపేశాడని ఇంకొంతమంది అంటారు. ఇది సాధించిన పశుపాలకి వామదేవుడి ద్వారా ఎన్నో బహుమానాలు అందాయని..." చెప్పుకొస్తున్న ఉగ్ర మాటలకి సిరిగిరి అడ్డం పడ్డాడు.

"ఉదంతుడు చనిపోవటమేమిటి? చెరసాల పాలవడం ఏంటి? అసలా అవకాశమే లేదు. అతను వామదేవుడి ఆంతరంగికుల్లో ఒకడు. మీ దగ్గర చేరి మీ ఆనుపానులు తెలుసుకోడానికి వచ్చిన గూఢచారి" చెప్పాడు సిరిగిరి.

ఆ గదిలో ఉన్న ప్రతి ఒక్కరూ ఊపిరి పీల్చడం మానేశారు.

"ఉదంతుడు గూఢచారి" అన్న మాటే అందరికీ మళ్ళీ మళ్ళీ వినపడుతోంది.

"మరి పశుపాల?" అడిగింది ద్వీప మెల్లగా చాలాసేపటి తరువాత

"మీరు అనుకుంటున్నట్లు ఉద్యమ ద్రోహి పశుపాల కదు. ఉదంతుడు. అతను బ్రతికేవున్నాడు కాబట్టి బహుశా పశుపాల బ్రతికి వుండే అవకాశం లేకపోవచ్చు. లేదా చెరసాలతో వుండి వుండచ్చు. ఏది ఏమైనా ఇప్పుడు అంతకన్నా ముఖ్యమనది మహాబసు ఉదంతుడితో కలిసి వెళ్ళాడన్న సంగతి. వెంటనే వాళ్ళిద్దరు ఎక్కడున్నారో తెలుసుకోకపోతే అది మహాబసు ప్రాణానికే ప్రమాదంగా పరిణమించవచ్చు." సిరిగిరి చెప్పిన మాటలు పూర్తికాక ముందే ఉగ్ర సొరంగ మార్గంలోకి దూకి ముందుకు పరుగెత్తాడు. ద్వీప కూడా అతన్నే అనుసరిస్తూ ముందుకురికింది.

ఆ సొరంగ మార్గం అంత సులభమైనది కాదు. చాలాకాలం నుంచి ఆ మార్గాన్ని తయారు చేయబడుతున్నట్లుగా ఆనవాలు తెలుస్తున్నాయి. ప్రతి రెండు మూడు వందల అడుగులకి ఒక కూడలిలా ఏర్పాటు చేశారు. అందులో ఒక దారి మాత్రమే గమ్యానికి చేరుస్తుంది. మిగిలిన ఏ దారి పట్టుకున్నా తిరిగి తిరిగి మళ్ళీ అక్కడే చేరుకునేలా ఏర్పాటు చేశారు. సరైన దారిని గుర్తించలేకపోతే ఆ సొరంగ మార్గంలో ముందుకు వెళ్ళడం అసాధ్యం. ఆ విషయం మొదటి కూడలి దగ్గరే అర్థం చేసుకున్న ఉగ్ర ఆగిపోయాడు. అతని వెనుకే ద్వీప ఇతర సైనికులు కూడా నిలబడిపోయారు.

"ఏం చేద్దాం?" ద్వీప అడిగింది.

ఉగ్ర ఏ సమాధానాన్ని చెప్పే పరిస్థితిలో లేడు. అతని తీక్షణమైన చూపులు దారి కనుక్కోడానికి ఏదైనా సులువైన మార్గం వుందేమోనని వెతుకుతున్నాయి.

<★><★><★>

"నేను అడిగినదానికి సమాధానం చెప్పలేదు నువ్వు" అన్నాడు మహాబసు. అప్పటికే వాళ్ళు చాలాసేపటిగా ఆ సొరంగ మార్గం గుండా ప్రయాణిస్తున్నారు.

"ఏమిటది మహాబసూ" అడిగాడు ఉదంతుడు.

"ఇంతకాలం ఏమైపోయావు?"

"మాహాధినేత వామదేవుడి అధీనంలో వున్నాను" ఉదంతుడి సమాధానం మహాబసుకి తృప్తిని ఇవ్వలేదు.

"బందీగానా?" అనడిగాడు. దానికి మాత్రం సమాధానం రాలేదు.

"కారాగారంలో వున్నావా?" అని రెట్టించాడు. మళ్ళీ మౌనమే సమాధానం అయ్యింది.

"పశుపాలకి ఎక్కడ?" ఈ చివరి ప్రశ్నకి మాత్రం ఉదంతుడు కాస్త తొట్రుపడ్డాడు. క్షణం ఆగి మహాబసు వైపు తీక్షణంగా చూశాడు. సమాధానం చెప్పకుండానే మళ్ళీ ముందుకు సాగాడు.

"పశుపాలని ఏం చేశావ్?" ఈసారి మహాబసు కంఠం రౌద్రంగా వుంది.

"పశుపాల చనిపోయాడు" వెనక వున్నమహాబసు వైపు చూడకూడదన్నట్లు ముందుకే చూస్తూ నడుస్తూ సమాధానం చెప్పాడు.

"ఎలా?" మరింత తీవ్రంగా అరిచాడు మహాబసు.

"అదంతా తీరిగ్గా మాట్లాడుకుందాం. ముందు ఇక్కడ్నుంచి బయటికి నడవండి" అంటూ అడుగులు ముందుకు వేశాడు.

మహాబసు అందుకు ఒప్పుకోడానికి సిద్ధంగా లేడు. వడివడిగా ముందుకు వచ్చి ఉదంతుడి ఎదురుగా నిలబడ్డాడు.

"ఉదంతా! ఏమిటిదంతా? మన సైన్యమంతా పశుపాల ఉద్యమద్రోహి అని నమ్ముతున్నారు. అతనే నిన్ను వధించాడని, లేదా ఎవరికీ తెలియకుండా ఏ కారాగారంలోనో బంధించాడని అనుకున్నారు. నువ్వు వున్నావు, పశుపాల లేడంటున్నావు. అంటే నువ్వే ద్రోహివని అనుకోమంటావా?" నిలదీశాడు

"ఒకటి మాత్రం చెప్పగలను మహాబసూ. పశుపాల నమ్మకమైన స్వామిభక్తిపరుడు. ఉద్యమాన్ని ఊపిరిగా మార్చుకున్నవాడు. అతను ఉద్యమద్రోహి కానే కాడు"

"అయితే నిన్ను ద్రోహిగా పరిగణించవచ్చా"

"ఇద్దరిలో ఒకరు ఖచ్చితంగా ద్రోహి అని ఎందుకు అనుకుంటున్నారు? మా ఇద్దరి మధ్య ఎలాంటి వ్యతిరేకత లేదు. మేము ఇద్దరం శత్రువులం కాదు. ఉద్యమం పట్ల అతనికి ఎంత విధేయత వుందో, నాకు మీ పట్ల అంతే విధేయత వుంది. ఇంతకన్నా ఎక్కువ ఇప్పుడు చెప్పలేను. త్వరలోనే పూర్తి విషయాలు మీతో చర్చిస్తాను." అంటూ అక్కడ్నించి కదలబోయేడు ఉదంతుడు.

"చివరి ప్రశ్న" మహాబసు మళ్ళీ అన్నాడు

ఉదంతుడు ఆగి – "అడగండి" అన్నాడు

"పశుపాలని చంపిందెవరు?"

సమాధానం రాలేదు. మళ్ళీ రెట్టించాడు. "చెప్పు ఎవరు చంపారు?"

"నేనే" అన్నాడు ఉదంతుడు. ఊహించిన విషయమే అయినా ఒక విస్ఫోటనం జరిగినట్లు అదిరిపడ్డాడు మహాబసు.

"వివరంగా చెప్పే తీరికలేదు. ప్రమాదం వెనుక నుంచి ముంచుకొస్తోంది. దయచేసి నా మాట వినండి. మనం ఇక్కడ్నుంచి తప్పించుకోవడం ముఖ్యం. తరువాత అంతా సావకాశంగా మాట్లాడుకుందాం" అన్నాడు ఉదంతుడు.

ప్రమాదం వెనుక నుంచి వస్తోందో లేక ఉదంతుడితో కలిసి ప్రమాదం వైపే నడిచి వెళ్తున్నాడో అర్థం కాలేదు మహాబసుకి. వెనక్కి పారిపోయే అవకాశం లేదు. వచ్చిన దారి మొత్తం ఎన్నో కూడళ్ల మీదుగా సాగింది. ప్రతి కూడలి నుంచి మూడు నాలుగు దారులు వున్నాయి. దాదాపు అన్నీ ఒకేలా కనిపించే దారులు అవి. ఏ దారి పట్టుకుంటే ఎటు వెళ్తామో తెలియని అగమ్యగోచర స్థితి. ఇలాంటి పరిస్థితిలో మహాబసుకి స్పృహ కోల్పోతున్నట్లు అనిపించింది. ఎదురుగా వున్న ఉదంతుడు క్రమక్రమంగా కనుమరుగై ఇంకెవరో నిల్చున్నట్లు కనిపించడం మొదలైంది. ఆ ఎదురుగా వున్న వ్యక్తి రూపం స్పష్టం అవుతున్నకొద్దీ గుర్తించడం మొదలుపెట్టాడు మహాబసు. ఆ ఎదురుగా వున్నది –

"సమ్రాట్ అశోక చక్రవర్తి"

(జరగబోయే జగన్నాటకం వచ్చే మాసం)

COMMENTS